

# ఆ నిరాశలో.. మంచుకురిసినా తెలియలేదు...

**ఎంచుకున్న వృత్తిలోనే కాదు... దాన్ని ఆచరించడంలోనూ కానన్ తనదైన శైలిని చూపారు. హైదరాబాదులోని తన సొంత కార్యాలయంలో ఉండి అమెరికాలో కట్టబోయే ఓ ఆకాశహర్మ్యానికి చక్కటి నిర్మాణప్రణాళిక గీసేస్తారామె. ఆమే కాదు... ఆమె దగ్గర పనిచేస్తున్న దాదాపు వందమంది వాస్తుశిల్పుల బృందం చేస్తున్న పనీ అదే. ఆమె ఆ పని మొదలుపెట్టినప్పుడు పెదవి విరిచిన వారంతా ఇప్పుడు ముక్కునవేలేసుకుంటున్నారట...**

అవును... కానన్ మోడీ చేస్తున్నది అదే. ఇ లాజిక్ టెక్ సొల్యూషన్స్ అనే వీరి సంస్థ భవన నిర్మాణాల రూపకల్పనకు సంబంధించి డిజైన్ల అవుట్‌సోర్సింగ్ చేస్తోంది. ఐదారేళ్ల క్రితం ఆ ఆలోచన వినగానే అందరూ నవ్వారు. ఇప్పుడు ఆసియాలో తొలి మూడు స్థానాల్లో ఉన్న సంస్థల్లో ఒకటయ్యేసరికి నాడు నవ్విన వారే నేడు సేవలందుకోవడానికి వేచి చూస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సంస్థగా డెలాయిట్ టెక్నాలజీ అవార్డు కూడా అందుకుందీమె సంస్థ. ఈ విషయం ఒకింత గర్వంగానే చెప్తారు యువవాస్తుశిల్పి, వ్యాపారవేత్త కానన్ మోడీ.

నేను స్త్రీని కావడంవల్ల ఈ రంగం గురించి ఈమెకేం తెలుసన్నట్లు చూసేవారు కొత్తలో. ఏ పనైనా ఒకటికి రెండుసార్లు చెప్తే కానీ అయ్యేది కాదు. స్త్రీలు తమని తాము నిరూపించుకుంటే తప్ప వారికి లభించాల్సిన గౌరవం దక్కదు. ఇప్పుడిప్పుడే పరిస్థితులు మారుతున్నాయనుకోండి. అదృష్టవశాత్తూ ప్రతిష్ఠాత్మక రామోజీ ఫిల్మ్‌సిటీ లాంటి చోట పనిచేయడం నాకెంతో దోహదం చేసింది. స్త్రీగా కాక వృత్తిపరంగా నా సామర్థ్యానికి విలువిస్తూ ఆదరించింది ఆ సంస్థ' అంటూ హైదరాబాదులో తన తొలిరోజుల్ని గుర్తుచేసుకున్నారామె.

## అమెరికాలో అలా కాదు...

కానన్ ముంబయిలో పుట్టిపెరిగిన గుజరాతీ యువతి. ముంబయి విశ్వవిద్యాలయంలోనే ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ పట్టా పొందారు. హైదరాబాదుకు చెందిన నీరవ్ మోడీతో వివాహానంతరం అమెరికా వెళ్లి అక్కడే స్నాతకోత్తర పట్టా అందుకున్నారు. భర్త సూచనమేరకు అక్కడ ఓ ఉద్యోగానికి దరఖాస్తు చేశారు కానన్. భవన నిర్మాణానికి సంబంధించి అప్పుడది అక్కడ ప్రథమస్థానంలో ఉన్న సంస్థ. న్యూయార్క్‌నగరంలో మంచుకురుస్తున్న వేళ కానన్ ఇంటర్వ్యూకెళ్లారు. వీసాకి సంబంధించి ఏవో కారణాలు చెప్పి వాళ్లు ఉద్యోగం ఇవ్వలేదు. నిరాశచెందిన కానన్ కోటు కూడా వేసుకోకుండా మంచులో అలాగే నడుస్తూ వెళ్లడం ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి గమనించారు. వెంటనే ఆమెను వెనక్కిపిలిపించి.. ఉద్యోగమిచ్చారు. 'వాళ్లు మన అర్హతలు మాత్రమే చూడరు... పనిచేయాలన్న జిజ్ఞాసను చూస్తారు. ఈ దృక్పథం నాకెంతో నచ్చింది. కాకపోతే హైదరాబాద్ వచ్చేయాలన్న కోరిక ఉండడం, అదే సమయంలో రామోజీ ఫిల్మ్ సిటీలో అవకాశం రావడంతో 2002లో ఇండియా వచ్చేశాం. మావారు ఫోర్డ్ డీలర్‌షిప్ తీసుకున్నారు. నేను ఒక ఏడాది పాటు ఆర్‌ఎఫ్‌సిలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేశాను. కృపాలూ కేవ్స్, ఎర్త్ క్వేక్ రైడ్ లాంటివి చేశాను. ఆ తర్వాత గర్భిణిని కావడంతో వైద్యపరంగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ఉద్యోగం వదలుకోవలసి వచ్చింది...' అని చెప్పిన కానన్ అక్కడ పనిచేసిన అనుభవం భవిష్యత్తులో కొత్తగా ఏదైనా చేయాలన్న జిజ్ఞాసను రగిలించిందన్నారు.

## తోడికోడలి ప్రోద్బలం

కానన్ తోడికోడలు రూపాలి 1999లోనే ఇ-లాజిక్ సొల్యూషన్స్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థని ప్రారంభించారు. ఆర్కిటెక్ట్ అయిన కానన్ ఓ రోజు తోడికోడలితో కబుర్ల వేళ తనకొచ్చిన అవుట్‌సోర్సింగ్ ఆలోచనను బయటపెట్టారు. రూపాలీకి ఆ ఆలోచన నచ్చింది. కానన్ సామర్థ్యం తెలుసు కాబట్టి వెంటనే ఆ దిశగా సన్నాహాలు చేశారు. ఎనిమిది మంది సిబ్బందితో 2003లో మొదలైన వీరి సంస్థ ఐదేళ్లు తిరిగేసరికి వందకు పైగా సిబ్బందితో పలు దేశాల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ సంస్థలకు సేవలందించగలిగింది. 'మేం మొదలెట్టినపుడు ఇది చాలా కొత్త పనే. ఇప్పుడు కూడా కొంతమందే ఈ దిశగా కృషిచేస్తున్నారు. అదృష్టవశాత్తూ తక్కువ సమయంలోనే చాలా పెద్ద ప్రాజెక్టులు చేసే అవకాశం మాకు లభించింది. హైదరాబాదులోని మా కార్యాలయంలో కూర్చుని అమెరికాలో డెబ్భైకి పైగా అంతస్తుల భవనానికి డిజైన్లు గీయడం, వినియోగదారుల అవసరాలమేరకు ఆ భవనానికి సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని పట్టించుకుని పరిష్కారాలు చూపడం... చాలా పెద్ద పనే. పైగా ఒక్కో విభాగం చూసే నిపుణులు ఒక్కో దేశంలో ఉంటారు. ఇలా అందరూ కలిసి సమన్వయంతో పనిచేస్తేనే అక్కడ భవనం పూర్తవుతుంది...' అంటూ తాము పనిచేసే విధానాన్ని వివరించారు కానన్.



రూపాలి

## సగానికిసగం వనితలే..

ఇప్పటికే వెయ్యి ప్రాజెక్టులు పూర్తిచేసిన ఇ-లాజిక్ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిలో సగం మంది వనితలేనని గర్వంగా చెప్తారు కానన్. పైగా కొత్త సంస్థ కావడంతో అందరూ ఉత్సాహం ఉరకలు వేసే యువతరంగాలేనని నవ్వుతూ చెప్పారామె.

## నిర్మాణమూ చేస్తున్నాం...

భవన రూపకల్పనతో ఆగిపోలేదు... నిర్మాణాలూ చేపట్టామని చెప్పారు కానన్. వాహనాల షోరూములు, వ్యాపార భవన సముదాయాలు, నివాస గృహాలు... అన్నీ నిర్మిస్తున్నారు. ఇప్పుడీ మొత్తం వ్యవహారాలను తోడికోడళ్లిద్దరూ చూసుకుంటారు. కానన్ భర్త కూడా వారంలో రెండు రోజులు వ్యాపారాభివృద్ధి లావాదేవీలు పర్యవేక్షిస్తారు. 'ఎవరి విభాగాలు వారికి కచ్చితంగా ఉన్నాయి. దాంతో, పరిధులు దాటడం, విభేదాలు తలెత్తడం లాంటి సమస్యలు రానే రావు. పైగా మేమంతా సమష్టికుటుంబంలో జీవిస్తున్నాం. ఇద్దరికీ ఇద్దరేసి చిన్నపిల్లలున్నా ఇంత సమయం వెచ్చించగలుగుతున్నామంటే కుటుంబ మద్దతే కీలకం' అని చెప్పారు రూపాలి. అమెరికాలో కూడా కార్యాలయం ఉండడంతో మూడునెలలకోసారి పదిరోజులు తప్పనిసరిగా అక్కడికెళ్లిరావాల్సి వస్తుంది. ఇద్దరూ వంతులవారీగా వెళ్తూ ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

'మేం నిర్మించే భవనం అన్నిటిమధ్య ప్రత్యేకంగా కన్పించడం కాదు... చుట్టుపక్కల భవనాలు, పర్యావరణం... అన్నిటితో మమేకమయ్యేలా ఉండడం నాకిష్టం. ఇంటీరియర్స్ విషయానికి వస్తే వివిధ దేశాల్లో భవనాలకు పనిచేసిన అనుభవంతో ఆధునిక, సౌకర్యవంతమైన పద్ధతులు అవలంబిస్తాను. మినిమలిస్టిక్... అన్నది నాకు నచ్చే అంశం'. సహజమైన గాలివెలుతురు ఇంటినిండా వ్యాపించేలా కట్టడానికి ఇష్టపడతాననే కానన్ తమ స్వగృహాన్నే అందుకు ఉదాహరణగా చూపించారు. వ్యాపారంలో తలమునకలుగా ఉన్నా సామాజిక బాధ్యతనూ మరవలేదీ యువ వ్యాపారవేత్త. కుటుంబం పేరు మీద ఉన్న 'ధర్మనిధి సంస్థ' పనులే కాకుండా విడిగా కూడా విద్య, వైద్య సేవలందిస్తున్నారు.